క్లుప్తంగా

ఆధునిక వ్యవసాయంపై అవగాహన

పుత్తూరు: సాంకేతిక పరిజ్ఞానంతో ఆధునిక వ్యవసాయంపై రైతులు అవగాహన పెంచుకోవాలని తద్వారా మంచి లాభాలను ఆర్జించవచ్చునని రాస్ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త సుధాకర్ సూచించారు. గురువారం రాస్ కృషి విజ్ఞాన కేంద్రం వారి ఆధ్వర్యంలో పుత్తూరు మండలం తొరూరు గ్రామంలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అయన మాట్లాడుతూ రానున్న ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకొని పంట ఉత్పత్తి, నేల ఆరోగ్యం, వనరుల నిర్వహణను మెరుగు పరచడంపై రైతులు దృష్టి సారించాలన్నారు. ప్రధానంగా భూసార పరీక్షల ఫలితాలను అనుసరించి ఎరువులు వినియోగించాలని సూచించారు. ఇష్టానుసారం ఎరువులు వినియోగిస్తే నష్టాలను చవిచూడాల్సి ఉంటుందని హెచ్చరించారు. నాణ్యమైన విత్తనాలను వినియోగించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చునన్నారు. కూరగాయలు, పూల సాగులో మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. వ్యవసాయాధికారి కోదండయ్య మాట్లాడుతూ 50 శాతం సబ్సిడీతో జనుము, జీలగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి వేణుగోపాల్, పశుసంవర్ధక శాఖ అధికారి దివాకర్, సర్పంచ్ వసంతమ్మ, వీఏఏలు మురళి, శిరీష, లావణ్య, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు

నగరి: రెవెన్యూ డివిజన్ పరిధిలోని మున్సిపాలిటీ, మండలాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త, సహాయకురాలు పోస్టులకు గురువారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ భవానీ శంకరి ఇంటర్వ్యూలు నిర్వహించారు. నగరి మున్సిపల్ పరిధిలోని చింతలపట్టెడ–3 అంగన్‌వాడీ కార్యకర్త పోస్టుకు, వినాయకపురం (చింతలపట్టెడ) అంగన్‌వాడీ సహాయకురాలి పోస్టుకు, పాలసముద్రం మండలం కేజే పురం అంగన్‌వాడీ సహాయకురాలి పోస్టుకు ఇంటర్వ్యూలు నిర్వహించగా ఆరుగురు హాజరయ్యారు. కార్యక్రమానికి స్త్రీశిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి ఓ.వెంకటేశ్వరి, బుగ్గ అగ్రహారం పీహెచ్‌సీ వైద్యుడు రమేష్, నగరి, జీడీ నెల్లూరు సీడీపీఓలు కృష్ణవేణి, వినీతశ్రీ, సూపర్‌వైజర్లు శంకరమ్మ, సంగీత, ఆఫీసు సిబ్బంది కరుణాకర్‌రెడ్డి, సుకన్య పాల్గొన్నారు.

బాధ్యతగా పర్యావరణాన్ని పరిరక్షించాలి



పర్యావరణ దినోత్సవ వేడుకల్లో అధికారులు

నగరి: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని డీఎస్పీ సయ్యద్ మహమ్మద్ అజీజ్ అన్నారు. గురువారం నగరి మున్సిపాలిటీలోని అధికారులందరూ సంయుక్తంగా మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన పర్యావరణ పరిరక్షణ దినోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మొక్కలు నాటిన అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులు హరిత దూతలుగా మారాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం పూర్తిగా నిషేధించాలని, గుడ్డసంచులు వాడాలన్నారు. గజల్ వినోద్ పాటల ద్వారా పర్యావరణం, చెట్ల పెంపకంతో కలిగే ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేశారు. ఎన్విరాన్‌మెంట్ ఈఈ రాజశేఖర్, సీఐ విక్రమ్, ఏఈలు నవీన్, హేమశేఖర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పురుషోత్తం, మెప్మా సీఎంఎం ప్రసాద్ పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

పాలసముద్రం: యోగా ప్రతి వ్యక్తికి ఆరోగ్యాన్ని ఇస్తుందని శ్రీకావేరిరాజుపురం సర్పంచ్ గాలి మహేష్‌బాబు, ఐకేపీ ఏపీఎం కల్పలతరెడ్డి తెలిపారు. గురువారం యోగా శిక్షణ కార్యాక్రమంలో భాగంగా శ్రీకావేరిరాజుపురం, నరసింహపురం, పాలసముద్రం గ్రామ సచివాలయ పరిధిలోని ప్రజలకు యోగాపై అవగాహన కల్పించి, యోగా చేయించారు.

వెదురుకుప్పంలో..

వెదురుకుప్పం: మండలంలోని నల్లవెంగనపల్లె గ్రామంలో డ్వాక్రా మహిళలు, ఉపాధి హామీ కార్మికులతో యోగా తరగతులు నిర్వహించారు. వెదురుకుప్పం అంగన్‌వాడీ కేంద్రంలో కార్వేటినగరం సీడీపీఓ పద్మసునంద ఆధ్వర్యంలో యోగాంధ్రపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ భారతి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదల ఇళ్లపై కూటమి కన్నెర్ర

- జగనన్న కాలనీల్లో వసతులు మృగ్యం
- ప్రభుత్వ సాయం కోసం లబ్ధిదారుల ఎదురుచూపులు

పేదల సొంత ఇంటి కల నెరవేర్చాలనే ఉద్దేశంతో గత వైఎస్‌ఆర్ సీపీ ప్రభుత్వం పెద్ద ఎత్తున అర్హులందరికీ స్థలాలు కేటాయించింది. జగనన్న కాలనీలను ఏర్పాటు చేసి పక్కా ఇళ్లు మంజూరు చేసింది. కొంతమంది ఇళ్లు నిర్మించుకుని కాపురాలు ఉంటున్నారు. మరికొందరు వివిధ దశల్లో ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పేదలపై కక్ష కట్టింది. జగనన్న కాలనీల్లో వసతులు కల్పించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. ఇటీవల పల్లె పండుగ పేరుతో గ్రామాల్లో సీసీ రోడ్లు నిర్మించిన కూటమి ప్రభుత్వం జగనన్న కాలనీల వైపు కన్నెత్తి కూడా చూడలేదు. ఫలితంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

–కార్వేటినగరం

గత వైఎస్‌ఆర్ సీపీ ప్రభుత్వంలో గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో 10 వేలకు పైగా ఇళ్లు మంజూరు చేశారు. కొన్ని ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. మరికొన్ని వివిధ దశల్లో ఉన్నాయి. పూర్తయిన ఇళ్లలో లబ్ధిదారులు కాపురాలు ఉంటున్నారు. గంగాధరనెల్లూరు, పెనుమూరు, శ్రీరంగరాజపురం, కార్వేటినగరం, పాలసముద్రం, వెదురుకుప్పం మండలాల్లో మొత్తం 10,407 మందికి పక్కా గృహాలు మంజూరు చేశారు. ఇందులో 7,003 ఇళ్లు పూర్తయ్యాయి. 722 శ్లాబ్ దశలో, 636 గోడల దశలో, 1803 పునాదుల దశలో ఉన్నాయి. 158 మంది పునాదులు వేసేందుకు సిద్ధమయ్యారు. ఇప్పటి వరకు నిర్మాణాలు చేపట్టని గృహాలు 85 ఉన్నట్లు అధికారుల లెక్కలను బట్టి తెలుస్తోంది. అదేవిధంగా నగరి నియోజకవర్గంలో 5,708 గృహాలు మంజూరయ్యాయి. 3,210 ఇళ్లు పూర్తయ్యాయి. 741 శ్లాబ్ దశలో, పైకప్పు వేయాల్సినవి 339, పునాదులు వేసి గోడల దశలో ఉన్నవి 839, పునాదుల దశలో 375 ఇళ్లు ఉన్నాయి. ఇంకా మొదలు పెట్టనివి 204 ఉన్నాయి. అప్పట్లో అధికారులు లబ్ధిదారుల చుట్టూ తిరిగి గృహ నిర్మాణాలను వేగవంతం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదల ఇళ్లపై శీతకన్ను వేసింది. బిల్లులు సక్రమంగా చెల్లించకపోవడంతో నిర్మాణాలు చేపట్టేందుకు లబ్ధిదారులు ముందుకు రావడంలేదు. ఫలితంగా పక్కా గృహాలు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. జగనన్న కాలనీలపై ప్రభుత్వం చిన్నచూపు చూడడంతో బోసిపోతున్నాయి.

జగనన్న కాలనీల్లో కరువైన వసతులు

జగనన్న కాలనీల్లో కనీస సౌకర్యాలు లేకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా సిమెంటు రోడ్లు, మురుగు కాలువలు లేవు. చిన్నపాటి వర్షానికే వీధులు బురదమయంగా మారుతున్నాయి. తాగునీటి సరఫరా కోసం ట్యాంకుల నిర్మాణాలు చేపట్టలేదు. పైపులైన్లు ఏర్పాటు చేయలేదు. జగనన్న కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని పలుమార్లు అధికారులను కోరుతున్నా పట్టించుకోవడం లేదని పేదలు వాపోతున్నారు.





నగరి మున్సిపాలిటీ నాగరాజకుప్పం శివారుల్లో పిచ్చిమొక్కల మధ్య జగనన్న కాలనీ, (ఇన్‌సెట్) పాలసముద్రం మండలంలో అర్ధంతరంగా నిలిచి పోయిన జగనన్న కాలనీ





వెదురుకుప్పం మండలం దేవరగుడిపల్లి వద్ద అసంపూర్తిగా జగనన్న ఇళ్లు, కార్వేటినగరం మండలం గోపిశెట్టిపల్లి వద్ద జగనన్న కాలనీ

సొంతింటి కల నెరవేరింది



నాకు పెళ్లి అయిన నాటి నుంచి అద్దె ఇంట్లోనే ఉంటూ వచ్చాం. జగనన్న చలవతో ఇంటి పట్టా ఇచ్చి స్థలం చూపించారు. ఇల్లు కట్టుకోవడానికి డబ్బిచ్చి ప్రోత్సహించారు. ఫలితంగా 2023 అక్టోబర్ 12న గృహ ప్రవేశం చేశాం. దీంతో అద్దె చెల్లించే సమస్య శాశ్వతంగా తీరిపోయింది. జగనన్న కాలనీలో వసతులు లేవు. అధికారులను కలిసినా పట్టించుకోవడం లేదు.

–ఎ.లత, కల్లూరు, వదమాలపేట మండలం

బిల్లు ఇవ్వలేదు



నాకు విజయపురం జగనన్న కాలనీలో ఇల్లు మంజూరైంది. పునాది వరకు కట్టాను. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇంత వరకు బిల్లులు ఇవ్వలేదు. పునాదితోనే పని ఆగిపోయింది. ఇల్లు లేక చాలా కష్ట పడుతున్నాను. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదు. జగనన్న కాలనీపై కూటమి ప్రభుత్వం చిన్న చూపు చూస్తోంది.

–రాజా బాదర్, విజయపురం

రోడ్లు నిర్మించాలని కోరినా ఫలితం లేదు



జగనన్న కాలనీలో ఇల్లు కట్టుకుని నివాసం ఉంటున్నాం. రోడ్లు వేయలేదు. మురుగు కాలువలు నిర్మించలేదు. చిన్నపాటి వర్షానికే వీధులు బురదమయంగా మారుతున్నాయి. నడక సాగించాలంటే కష్టంగా ఉంది. మా ఇబ్బందులను అధికారులకు వివరించినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్ల నిర్మాణం చేపట్టాలి.

–బీకమ్మ, బసివిరెడ్డిపల్లి, శ్రీరంగరాజపురం

ఇబ్బందులు పడుతున్నాం

జగనన్న కాలనీలో మౌలిక వసతులు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఇళ్ల నిర్మాణాల కోసం ప్రతి లేఅవుట్‌లో బోరు వేయించారు. అదే విధంగా ప్రతి ఇంటికీ విద్యుత్ మీటర్లను ఉచితంగా అందజేశారు. ప్రస్తుతం నిర్మాణాలు పూర్తి చేసుకున్నాం. వీధి దీపాలు, రోడ్లు, తాగునీటి సదుపాయం, కాలువలు లేక ఇబ్బంది పడుతున్నాం.

–శోభ, గోపిశెట్టిపల్లి, కార్వేటినగరం

గంగమ్మ సేవలో మాజీ మంత్రి రోజా





గంగమ్మను దర్శించుకుంటున్న మాజీ మంత్రి రోజా, గంగమ్మ దేవత

నింద్ర: మండల కేంద్రమైన నింద్ర గ్రామంలో గంగమ్మ జాతర సందర్భంగా గురువారం గ్రామంలోని గంగమ్మను మాజీ మంత్రి ఆర్కే రోజా దర్శించుకున్నారు. గంగమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలను చల్లగా చూడాలని కోరారు. గంగమ్మ జాతర సందర్భంగా గ్రామంలో అంబళ్లు పోశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దీప, వైస్ ఎంపీపీ శుభ, మండల కన్వీనర్ వేణురాజు, మండల ప్రచార కన్వీనర్ శివలింగాచారి, మునికృష్ణారెడ్డి, సర్పంచ్ బాబురెడ్డి, మునిరాజ్, అనిల్, విజేష్, శెల్వం, రేవతి పాల్గొన్నారు.

బాధితులకు మాజీ మంత్రి పరామర్శ



పరామర్శిస్తున్న మాజీ మంత్రి ఆర్కే రోజా

నగరి: మండలంలోని దేశూరు అగరం గ్రామంలో టీడీపీ అక్రమ కేసుల కారణంగా అరెస్టు కావడంతో పాటు వేధింపులకు గురై సబ్‌జైలు నుంచి నివాసాలకు చేరుకున్న వైఎస్‌ఆర్ సీపీ నాయకులు రంగనాథం, అతని కుటుంబ సభ్యులను మాజీ మంత్రి ఆర్కే రోజా పరామర్శించారు. గురువారం దేశూరు అగరం గ్రామంలోని రంగనాథం నివాసానికి వెళ్లిన ఆమె వారిని పరామర్శించి, ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెడ్‌బుక్ రాజ్యాంగంలో వైఎస్‌ఆర్ సీపీ నాయకులపై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపుతున్నారని ముఖ్యంగా దళితులనే టార్గెట్ చేసి వేధిస్తున్నారన్నారు. పార్టీ నేతలకు తాను ఎప్పుడూ అండగా నిలబడతానన్నారు. కేసు నుంచి బయటపడడానికి పూర్తిస్థాయిలో సహకారం అందిస్తామన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు తిరుమలరెడ్డి, వైస్‌ఎంపీపీ కన్నియప్ప, నాయకులు బుజ్జిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, రవికుమార్, పరంధామరెడ్డి, శ్రీహరిరెడ్డి, సత్య, దినకర్‌రెడ్డి, ఆనందరెడ్డి, గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా ధ్వజారోహణం



పూజలు చేస్తున్న అర్చకులు

వెదురుకుప్పం: మండలంలోని తిరుమలయ్యపల్లె పంచాయతీ చెంచుగుడి సమీపంలోని శ్రీద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో జరగనున్న మహాభారత ఉత్సవాలను పురస్కరించుకుని గురువారం ఆలయంలో ధ్వజారోహణం కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అంతకు ముందు ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం సకల దేవతలకు ఆహ్వానం పలుకుతూ ధ్వజారోహణం చేశారు. ప్రతి రోజూ రాత్రి శ్రీవెంకటేశ్వర కళా నాట్యమండలి ఆధ్వర్యంలో వీధి నాటక ప్రదర్శన ఉంటుందని చెప్పారు. ధ్వజారోహణం కార్యక్రమానికి స్థానిక ఎంపీటీసీ సభ్యురాలు హరి, విజయశేఖర్‌రెడ్డి కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఆలయ కమిటీ సభ్యులు వెంకటరమణారెడ్డి, పట్టాభిరామిరెడ్డి, పెద్దలు పాల్గొన్నారు.

రేషన్ దందాపై అధికారుల తనిఖీలు

సాక్షి ఎఫెక్ట్..

నగరి: జిల్లా వ్యాప్తంగా రేషన్ దందా జరుగుతోందంటూ గురువారం సాక్షి దిన పత్రికలో ప్రచురితమైన రేషన్ దందా వార్తకు అధికారులు స్పందించారు. ఆర్డీఓ భవానీ శంకరి ఆదేశాల మేరకు తహశీల్దార్ రవికుమార్, సీఎస్‌డీటీ పళని రేషన్ సరకుల నిల్వ ఉందంటూ చూపిన ప్రాంతానికి వెళ్లి ఆరా తీశారు. అయితే ఆ ప్రాంతాలు ఖాళీగా ఉండడం, బియ్యం నిల్వలు ఇక్కడ లేవంటూ స్థానికులు పేర్కొన్నారు. రేషన్ డీలర్ల వద్ద ఉన్న బియ్యం నిల్వలు, అప్పటి వరకు సరఫరా చేసిన బియ్యం నిల్వలను బేరీజు వేసి అన్నీ సరిగా ఉన్నాయని తేల్చారు. అనంతరం ఈ అంశంపై డీలర్లకు ఆయన హెచ్చరికలు జారీ చేశారు. లబ్ధిదారులకు బియ్యం ఇవ్వకుండా డబ్బులు ఇస్తుండడం గుర్తిస్తే పర్యవసానం తీవ్రంగా ఉంటుందన్నారు. కొనుగోలు చేసిన డీలర్లు, అమ్మిన లబ్ధిదారులపైనా చర్యలు తీసుకుంటామన్నారు. రేషన్ సరకులను లబ్ధిదారులకు అందించే విషయంలో ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారన్నారు.

సీనియర్ అసిస్టెంట్‌కు పదోన్నతి

గంగాధరనెల్లూరు: మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న సురేందర్‌రెడ్డి పదోన్నతి పొంది బదిలీపై వెళ్లారు. సీనియర్ అసిస్టెంట్‌గా ఉన్న సురేందర్ రెడ్డి పెద్దపంజాణి మండల ప్రజా పరిషత్ కార్యాలయానికి అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పదోన్నతి పొందారు.

బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపల్‌గా ప్రభావతి



ప్రభావతి

గంగాధరనెల్లూరు: మండలంలోని బంగారెడ్డిపల్లి వద్ద ఉన్న బాలికల గురుకుల పాఠశాలకు ప్రిన్సిపల్‌గా ప్రభావతి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె నెల్లూరు జిల్లా డక్కిలి గురుకుల పాఠశాల నుండి బదిలీపై గంగాధరనెల్లూరు గురుకుల పాఠశాలకు వచ్చారు. ఇప్పటి వరకు పాఠశాల ఉపాధ్యాయిని దమయంతి ఇన్‌చార్జి ప్రిన్సిపల్‌గా విధులు నిర్వహించారు.

ఎంపీటీసీ కుటుంబానికి పరామర్శ



ఎంపీటీసీ కుటుంబాన్ని పరామర్శిస్తున్న వైఎస్‌ఆర్ సీపీ నాయకులు

వెదురుకుప్పం: మాంబేడు ఎంపీటీసీ గుణశేఖర్ కుటుంబాన్ని వైఎస్‌ఆర్ సీపీ నాయకులు పరామర్శించారు. ఇటీవల ఎంపీటీసీ తల్లి అనారోగ్యంతో మృతి చెందడంతో గురువారం వైఎస్‌ఆర్ సీపీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు బండి హేమసుందర్‌రెడ్డి, యువత మాజీ మండల అధ్యక్షుడు బోడిరెడ్డి నరేష్‌రెడ్డి గ్రామంలో పర్యటించారు. ఎంపీటీసీ తల్లి చెంగమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

సాయివివేకానంద విద్యార్థికి ప్రతిభా అవార్డు



ఎంకే రఘురామ్

నగరి: పట్టణ పరిధిలోని సాయి వివేకానంద జూనియర్ కళాశాల విద్యార్థి ఎంకే రఘురామ్ ప్రతిభ అవార్డుకు ఎంపిక య్యాడు. ఇంటర్‌లో వెయ్యి మార్కులకు గాను 990 మార్కులు సాధించడంతో గురువారం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిభ అవార్డు ప్రకటించింది. అవార్డు సాధించిన విద్యార్థికి కళాశాల డైరెక్టర్లు, అధ్యాపక బృందం అభినందనలు తెలిపింది.

వైభవంగా కుంభాభిషేక మహోత్సవం



కుంభాభిషేకంలో పాల్గొన్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి, పార్టీ శ్రేణులు

వెదురుకుప్పం: మండంలోని పెరుమాళ్లపల్లెలో ఉన్న శ్రీకోదండరామస్వామి ఆలయంలో రెండు రోజులుగా సంప్రోక్షణ కుంభాభిషేక మహోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. గురువారం ఆలయంలో వేదపారాయణం, శ్రీరామ మూలమంత్ర హోమం, దూపదీప నైవేద్యాలతో పాటు ఏకాంత సేవ తదితర పూజలు నిర్వహించారు. యంత్ర గోపుర శిఖరం ప్రతిష్ట, యాగమంగళ నీరాజన విగ్రహ ప్రతిష్ట, మంగళహారతి సమర్పించి తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు.

మాజీ డిప్యూటీ సీఎం పూజలు

పెరుమాళ్లపల్లె గ్రామంలోని శ్రీకోదండరామస్వామి ఆలయంలో జరుగుతున్న కుంభాభిషేక మహోత్సవానికి గురువారం సాయంత్రం మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి హాజరయ్యారు. పార్టీ నాయకుడు షణ్ముగంరెడ్డి పిలుపు మేరకు వచ్చిన ఆయనను అర్చకులు సాదరంగా స్వాగతించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తదుపరి తీర్థ ప్రసాదాలు వితరణ చేసి ఘనంగా సత్కరించారు. ఇందులోభాగంగా ఆలయానికి రూ.20,116 నగదు విరాళంగా ప్రకటించినట్లు వైఎస్‌ఆర్ సీపీ కార్యనిర్వాహక జిల్లా కార్యదర్శి ఎం. రామయ్య తెలిపారు. ఆయన వెంట జెడ్పీటీసీ సుకుమార్, మండల పార్టీ అధ్యక్షుడు పద్మనాభరెడ్డి, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు బండి హేమసుందర్‌రెడ్డి, యువత మండల అధ్యక్షుడు గణపతిరెడ్డి, మాజీ యువత అధ్యక్షుడు నరేష్‌రెడ్డి, నాయకులు పరంధామరెడ్డి, షణ్ముగరెడ్డి, భాస్కర్‌రెడ్డి, నారాయణరెడ్డి, కమిటీ సభ్యులు ఉన్నారు.

అభివృద్ధికి అధికారుల సహకరించాలి



హాస్టల్ భవనం నిర్మించాలని కోరుతున్న సభ్యులు

నింద్ర: మండల అభివృద్ధిలో అధికారులు కీలక పాత్ర పోషించాలని ఎంపీపీ దీప అన్నారు. గురువారం నింద్ర మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రజల సమస్యలపై మండల అధికారులు స్పందించి ప్రజాప్రతినిధులకు సహకరించాలన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో తాగునీరు, పారిశుధ్య సమస్యలు లేకుండా చూడాలని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల మంజూరులో స్థానిక ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకొచ్చి అర్హత కలిగిన వారిని ఎంపిక చేయాలన్నారు. ప్రజా ప్రతినిధులకు సమాచారం లేకుండా అధికారులు ఏకపక్షంగా ఎంపిక చేయడం తగదని పలువురు సభ్యులు వాపోయారు. కో–ఆప్షన్ సభ్యుడు అనిల్ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడంతో జ్వరాలు ప్రబలకుండా నివారణ చర్యలు తీసుకోవాలని అన్నారు. హాస్టల్ భవనం లేకపోవడంతో మండల కేంద్రంలో విద్యార్థులకు సమస్యగా ఉందని, వెంటనే నిర్మించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వైస్ ఎంపీపీ శుభ, ఎంపీడీఓ శివప్రసాద్‌వర్మ, హౌసింగ్ ఏఈ శ్రీధర్‌రాజు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివరామకృష్ణశర్మ, ఇరిగేషన్ ఏఈ లోకేశ్వర్ రెడ్డి, ఎంఈఓ శ్రీధర్‌రాజు, పీఆర్ ఏఈ వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం నిర్ధారించిన ధరకే మామిడిని కొనాలి



జీడీ నెల్లూరులో కర్మాగారం మేనేజర్‌తో మాట్లాడుతున్న రైతునాయకులు

గంగాధరనెల్లూరు: ప్రభుత్వం నిర్ణయించిన ధరకే మామిడి పంటను జ్యూస్ కర్మాగారాల యాజమాన్యాలు కొనుగోలు చేయాలని జిల్లా రైతు సంఘం నాయకుడు, వైఎస్‌ఆర్ సీపీ జీడీ నెల్లూరు మండల అధ్యక్షుడు కేఆర్ వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని కర్మాగారంలో తోతాపురి మామిడి పంటను టన్ను ఐదు వేల రూపాయలకు కొనుగోలు చేస్తామనడంతో ప్రభుత్వం నిర్దేశించిన టన్ను ధర రూ.12 వేలకు కొనాలి అని కర్మాగారం మేనేజర్‌ను డిమాండ్ చేశారు. స్పందించిన మేనేజర్ కర్మాగారం యాజమాన్యంతో మాట్లాడి సత్వర చర్యలు చేపడుతామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల సమావేశంలో టన్ను ధర రూ.12 వేలతో కొనుగోలు చేస్తామని హామీ ఇవ్వగా, తక్కువ ధరకు కొంటామంటున్న యాజమాన్యాలతో సంప్రదింపులు జరిపి రైతులకు న్యాయం కలిగేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రైతులు త్యాగరాజురెడ్డి, కోదండరెడ్డి, బుజ్జిరెడ్డి, జయరాంరెడ్డి, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతిని పరిరక్షించుకోవాలి



మొక్క నాటుతున్న న్యాయమూర్తులు రాఘవేంద్ర, రమ్యసాయి

పుత్తూరు: ప్రకృతికి ప్రతి రూపాలైన భూమి, ఆకాశం, గాలి, నీరు, నిప్పుతో మానవుని మనుగడ ముడిపడి ఉందని, ఏ ఒక్కటి లోపించినా పరిస్థితి దుర్భరమవుతుందని స్థానిక సీనియర్ సివిల్ జడ్జి ఎస్.సి.రాఘవేంద్ర పేర్కొన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక సబ్ కోర్టు ఆవరణలో అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి కె.రమ్యసాయితో కలిసి మొక్కలు నాటారు. జడ్జి మాట్లాడుతూ ఆధునికత పేరిట యువతీ యువకులే ఎక్కువ శాతం పర్యావరణాన్ని పాడు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది భవిష్యత్తు తరాలకు ఏమాత్రం ఆమోదయోగ్యం కాదన్నారు. మొక్కలను విరివిగా నాటడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చునని తెలిపారు. ప్రతి ఒక్కరూ కాలుష్యాన్ని నివారిస్తూ, మొక్కల పెంపకాన్ని చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయవాదులు సురేష్‌బాబు, సంజీవి, శేషు తదితరులు పాల్గొన్నారు.

వధూవరులకు మాజీ మంత్రి ఆశీర్వాదం





వధూవరులను ఆశీర్వదిస్తున్న మాజీ మంత్రి రోజా

పుత్తూరు: పట్టణంలో గురువారం రాత్రి జరిగిన పలు వివాహా వేడుకల్లో మాజీ మంత్రి ఆర్కే రోజా పాల్గొన్నారు. పుత్తూరు మున్సిపల్ వైస్ చైర్మన్ శంకర్ సోదరి కుమార్తె దివ్యశ్రీ, గూళూరుకు చెందిన వైఎస్‌ఆర్ సీపీ నాయకుడు రామ్మూర్తి సోదరుని కుమార్తె కళావతి, ఎస్‌బీఆర్ పురానికి చెందిన బాబు చెల్లెలి కుమార్తె గౌరీ, ఈశ్వర్‌ల వివాహ రిసెప్షన్లలో పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. ఆమె వెంట వైఎస్‌ఆర్ సీపీ నాయకులు పాల్గొన్నారు.